# అమ్మ

"అమ్మ"

ఈ పుస్తకం నేను చదివాను. గోర్కీ రాసిన ఈ పుస్తకం ప్రపంచ ప్రఖ్యాతి చెందిందనే విషయం నా దృష్టిలో ఉంది. ఆ నవల్లో నేను వెతుక్కుంది విప్లవాన్ని కాదు, మాతృత్వపు అనుభూతిని.

"అమ్మ!"

ఈ పేరుమీద వచ్చిన సినిమాలన్నీ చూశాను. వీటిలో ఉన్న విశ్వజనీన అంశాల కోసం కాదు. వ్యక్తిగత ప్రతిస్పందనల కోసమే.

"అమ్మ."

కేవలం ఈ రెండక్షరాల గురించి ఎంత సారస్వతం వెలువడిందో! మన కవులూ, సినీ కవులూ అమ్మ గురించి ఎంత వర్ణించనీ, గానం చెయ్యనీ నా అన్వేషణ మాత్రం ముగియలేదు.

కారణం-నాకంటూ ఓ అమ్మలేదు. అమ్మలేని అనాథల్లో నేనూ ఒకణ్ణి. ఈ ప్రపంచంలో ఎక్కడో చోట ఆమె ఉండే ఉంటుంది. ఏ క్షణాల్లోనైనా నేనామెకు గుర్తొస్తానా?

నన్ను ఇలా విడిచివెళ్ళటం వెనక ఆమె స్థితి ఏమిటి? ఎప్పుడైనా ఇలాంటి పని చేసినందుకు కదిలిపోయిందా? నా కీ జన్మ ఇవ్వాల్సి వచ్చినందుకు ఆమె ఎలా ప్రతిస్పందించింది?

నాలో రకరకాల ఆలోచనలు. నేను అనేక సినిమాలు చూశాను. నాలాంటి వారంతా సంఘ వ్యతిరేకశక్తులుగా మారతారు. వారికి తల్లి దండ్రులమీద అంతులేని ద్వేషం కలుగుతుంది. బహు విచిత్రంగా ఆ నాయకుడు తన కన్నవారిని కలుస్తాడు.

అరుదుగానైనా జీవితంలో అలాంటి మెలోడ్రామా ఉంటుందను కుంటాను. అయినా కూడా భవిష్యత్తులో అలాంటి సన్నివేశం ఎదుర్కో గలననే ఊహ సైతం రాదు.

నేను చదివిన సాహిత్య ప్రభావమేమో నా కెవరిమీదా ద్వేషంలేదు. సారసత్వం నాలో ఓ రకమైన నిర్లిప్తతను కలిగించిందేమో! అలాగని అన్నింటినీ భరించే సహనమూ లేదు. నాలో అన్ని కోణాలా ఉన్నాయి.

నేను ఈ రూపంలోకి ఇంకా రాకముందు....

ఆ రెండు హృదయాల స్పందనల్ని అర్థం చేసుకోవాలనే ఆరాటం నాది. వారి ప్రతి చర్యనూ సమాజం శాసిస్తుందనే స్పృహ వారికి లేదా? ఈ సమాజం కర్కశమైనదే!

మరి మాతృత్వపు అనుభూతి వాస్తవమేనా? ఈ సారస్వతం, ఈ సినిమాలు ఇవన్నీ మేలిముసుగు కప్పటం లేదు కదా?

లేకపోతే ఈ విశాల ప్రపంచంలో ప్రతి రోజూ అనాథల సంఖ్య ఎందుకంతగా పెరగటం? ఈ పరిస్థితులన్నీ వారి అనుభవంలోకి రావటం లేదా? ఇలా కని, వారిని ఎక్కడో పారేసి, తాము మాత్రం ఎవరెవరి అండలోనో బతకటం న్యాయమా? అంత ధైర్యంగా ముందడుగు వేసిన వారు, ప్రాణిసృష్టిలో భాగమైన వారు-ఆ జీవిని నిర్దాక్షిణ్యంగా నడిరోడ్డు మీదకు విసరటమా?

ఎంత అనాగరికం! ఎంత దయలేని, ఎంత క్రూరమైన తల్లిమనసు! అవును మరి-తమకు ధైర్యం లేనప్పుడు ఓ ప్రాణిని కని వాడి కర్మకి వాడి నొదిలి అనుక్షణం చిత్రహింసకు గురిచేయటం ఎందుకు? పిండ రూపం లోనే నాశనం చేయొచ్చు కదా?

సరే. ఇక మగాడి గురించి చెప్పేదేముంది! అనేకమందికి కావలసింది స్త్రీ....భౌతికంగా మాత్రమే. ఆమె హృదయంతోనూ, మనసుతోనూ సంబంధంలేదు. పురుషుడి జీవితమంతా స్త్రీని ఎలా ఆకర్షించాలా అనే ధ్యాపన. తన అవసరం తీరాక తన దారి తనది. ఈ లోకంలో అనాథల్ని వెదజల్లటం వెనక పురుషుడి పాత్ర తక్కువని నేను చెప్పను. పురుషుడెంత భయంకరుడో నాకు తెలుసు. వాడికి శరీరం మాత్రమే కావాలి. తన కోర్కెవల్ల ఓ జీవి ఉద్భవిస్తుందని తెలిసీ మగాడు తేలిగ్గా ఓ సలహా పారేస్తాడు.

"అబార్షన్ చేయించుకో."

మరి స్త్రీ ఎందుకంత నిర్దాక్షిణ్యంగా ఉండదు? తన కడుపులోని బిడ్డను చంపటానికి అంగీకరించ దెందుకు? ఇదే మాతృత్వపు అనుభూతా? అలాంటిది పుట్టాక ఈ సమాజంలో ఆ బిడ్డ అనుభవించే ఈ చిత్రవధను ప్రసాదించటం కూడా మాతృత్వమేనా?

అందుకే అంటాను. ఈ సారస్వతం నిజంగానే ముసుగులు తొడుగుతుంది-అనేక విషయాలమీద.

లేకపోతే ఈ ప్రపంచంలో అన్నీ కలుషితమైపోతుండగా, అన్ని సంబంధాలలో పెనుమార్పు లొస్తుండగా ఏ మార్పులకూ లోనుకానిది ఈ బంధమేనా?

ఏమిటో, నాలో ఇలా విభిన్న కోణాలు నాకు లేని విషయమై ఆలోచనలు ఎక్కువై, ఒక్కోసారి కసి...ఒక్కోసారి జాలి...మరోసారి నిర్లిప్తత. అయినా ఇవేవీ సరైనవి కావు.అమ్మను గురించిన అనుభూతులూ, అమ్మను గురించిన త్యాగమూ, అమ్మను గురించిన విశ్వజనీన సాహిత్యం అంతా పాక్షికం.

ఏదో ఒక కోణాన్ని మాత్రమే అద్భుతంగానో, అసహ్యంగానో చిత్రించేవి! నా ఈ అవగాహనను అందరూ కాకున్నా కొందరైనా అంగీక రించగలరనుకుంటాను.

నేను నడిచి వస్తున్నాను. నా వృత్తిపరమైన అంశాలు తప్పించి, ఎక్కువగా నేను ఆలోచనలలోనూ, ఊహల్లోనూ కాలం గడుపుతుంటాను. అందుకే సాధ్యమైనంతవరకూ రోడ్డు పక్కనే నడుస్తుంటాను.

ఒక్కసారే పెద్ద శబ్దం.

ఉలిక్కిపడ్డాను. రోడ్డు మీద పడ్డ సీసా బద్దలైంది. దానిలోని నూనె దుమ్ములో ఇంకిపోయింది. మరి కొంత దూరంలో ఓ బాబు పడి పోయాడు.

అప్పుడే వాడి మోకాలు నుంచి బొటబొటా రక్తం. ముఖంమీద నల్లగా కమలటం. బుసబుస పొంగిన చెయ్యి.

"అమ్మా! అమ్మా! ఆ పిల్లాడు ఏడుస్తున్నాడు.

విసురుగా వచ్చి గుద్దిన సైకిల్ మనిషి లేచాడు. తన సైకిల్ వంకర తీసుకుని వేగంగా తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు. తనమీద కేం వస్తుందో అనే ఆరాటం. రానురానూ విలువ లెంతగా దిగజారుతున్నాయి? ఆ బాబు ఇంకా దుమ్ములోనే ఉండి "అమ్మా, అమ్మా!" అంటూ ఏడుస్తున్నాడు.

దగ్గరకు వెళ్ళాను.

చొక్కా చిరిగిపోయింది. సంచిలోని బియ్యం, ఎండుమిరప కాయలు, ఇంకా ఏవేవో దినుసులు దుమ్ములో...ఆ బాబు రోడ్డుకు ఎడమ పక్కనే నడుస్తున్నాడు.

"ఏం బాబూ హాస్పటల్ కెళ్దామా?"

"అమ్మ కావాలి"

చివుక్కుమంది నా మనసు. తల్లి ప్రేమ నిజంగానే విశ్వజనీన మైందా?

"మీ ఇల్లెక్కడ ?"

"దగ్గరే"

రిక్షా పిలిచాను. ఆ బాబుతోపాటు నేనూ కూర్చున్నాను. ఇల్లు దగ్గర్లోనే ఉంది. రిక్షా ఆగాక అతన్ని మెల్లగా దింపి, చేయి పట్టుకొని నడి పించు కెళ్తున్నాను.

అది పూరిల్లు. అక్కడున్నవన్నీ అవే. రోడ్డు పక్కన ఇళ్ళు. అక్కడ చెట్లకింద రకరకాల పనులు చేసుకుంటున్నారు.ఓ బడ్డీ,ఓ టీస్టాల్ ఉన్నాయి.

ముందు ఆ గాయాలు తుడిచి, టించర్‌తో అద్దాలి. హాస్పటల్‌కు తీసుకు క్తేగాని, చేతి ఎముక విరిగిందా అనేది తేలదు. ఆలోచనల్లో వున్న నాకు ఓ క్షణం అర్థం కాలేదు. ఓ స్త్రీ సుడిగాలిలా ప్రవేశించింది.

"ఏమైందిరా?"

"సైకిల్ గుద్దిందమ్మా" ఏడుస్తూ అన్నాడు.

"నూనె పోయిందా?"

"సీసా పగిలింది".

"బియ్యం కూడానా?"

"అన్నీ మట్టిలో పడ్డాయి".

నేను ఏదో చెప్పబోయేంతలో, అమాంతం పూనకం వచ్చినట్లు ఆ కుర్రాడి మీద పడి ఎడా పెడా కొడుతూ అంది.

"దరిద్రపు మొఖమోడా! కళ్ళు నెత్తిన పెట్టుకుని నడుస్తావురా! ఎన్నిసార్లు చెప్పినా అంతే. ముదనష్టపోడా! నువ్వు చచ్చినా బాగుండేది."

"ఆగమ్మా ఆగు" అందామనుకున్నాను.

ఆమె ఆగలేదు. ఆ బాబు ఏడుస్తూ కూడా "అమ్మా.... అమ్మా...!" అంటున్నాడు.

గిరుక్కున వెనక్కి తిరిగాను.

అమ్మ... అమ్మ... అమ్మ... అంత దెబ్బల్లోనూ 'అమ్మ'!

నేను నడుస్తున్నాను. నా ముందు ప్రపంచ ప్రఖ్యాత రచయితల ముఖాలు కనిపిస్తున్నాయి.

"ఓ రచయితలారా! ఇప్పుడు చెప్పండి. మీరంతా చిత్రించింది తల్లికి చెందిన ఓ కోణాన్ని కాదూ? రక్తం కారుతూ శరీరమంతా గాయాలతో వున్న బిడ్డను పలకరించే తీరు ఇదేనా? ఇదే మీరైతే ఏం రాస్తారు! తన బిడ్డ గాయాల్ని చీర చెంగుతో తుడిచి, గుండెల కదుముకొని కన్నీరు కార్చే అమృత హృదయాన్ని గురించి ఎన్నెన్ని పేజీలయినా విశ్వజనీనంగా రాయగలరు.

మరి ఇదేమిటి? ఈ తల్లి ఒలికి పోయిన నూనె కోసం, అర కిలో బియ్యం కోసం, పది నెలలు మోసి కన్నబిడ్డను చావమని శపిస్తోంది?

నేను నడుస్తూనే ఉన్నాను.

నా గదికి నేను వెళ్ళాలి. ఇంత హీనమైన, బాధ్యతారహితమైన ప్రపంచంలో జీవిస్తున్నందుకు, అలాంటి నేరానికి ఈ సంఘర్షణను మించి శిక్ష ఏముంటుంది ?

గది తలుపులు తెరుచుకున్నాయి. నా గది గోడలమీద తల్లి స్తన్యం గ్రోలుతున్న పసిబిడ్డ. ఆ తల్లి కళ్ళలో అద్భుతమైన ఆర్తి. వెన్నముద్దలు

తింటున్న కృష్ణుడు, యశోద. నా అద్దాల బీరువాలో వివిధ భాషల్లోని గ్రంథాలు. అన్నీ అమ్మను గురించి ఏదో కోణం ప్రతిబింబించేవే.

కిటికీ తలుపు తెరిచాను. చల్లటి గాలితో పాటు రెండు దోమలు..
నాకు అర్థంకాని విషయాలు రెండు. ఆ పిల్లవాడు ఆ స్థితిలో వుంటే మనిషి అనే వారెవరైనా హృదయం చలిస్తుంది. మరా అమ్మ ఎందుకలా ప్రవర్తించి? ఆ పిల్లాడు అన్ని దెబ్బలు తింటున్నా 'అమ్మా' అంటూ ఎందు కేడుస్తున్నాడు ?

నేనలా చాలాసేపు కూర్చుండి పోయాను. నేను బదులు చెప్పని ప్రశ్నలు. ఒక్కోసారి విశ్వజనీనమైన తల్లి ప్రేమను నేను ఆమోదిస్తాను. అంతలోనే మరో కోణంనుంచి తల్లిని ద్వేషిస్తాను.

ఈ రోజుతో నేను ఓ నిర్ణయానికి వచ్చాను. తల్లి ప్రేమ కూడా బూటకమే. అదేమీ సాధారణ అనుభూతులకు అతీతమైందేమీ కాదు. లేకుంటే ఓ గాయపడ్డ పసివాడ్ని గొడ్డును బాదినట్లు బాదటం మాతృత్వ మనే సంగతలా వుంచి మానవత్వమా ? ఆ సైకిల్ వాడికి, తల్లికి తేడా ఉందా ?

మరి అంత బాధలోనూ ఆ పసివాడు "అమ్మా" అని మాత్రమే ఎందుకన్నాడు ?

అవును ఎందుకన్నాడు ?

ఎందు కెందుకు ?

నేను జవాబు చెప్పలేని ప్రశ్న ! మాతృత్వపు విశ్వజనీనత ఇదేనా?

ఊరంతా దీపాలు వెలుగుతున్నప్పుడు నే నింకా, నా గదిలో.... చీకటిలో కూర్చున్నాను. అప్పుడు నా కనిపించింది.

'అవునూ, ఆ కుర్రాడినలా వదిలేసి వచ్చానేమిటి? నా ప్రతిస్పందన ఎంత హీనంగావుంది! నన్ను ఓ తల్లి అన్యాయం చేసుండవచ్చు. ఆ తల్లి తన బిడ్డను కొట్టవచ్చు. అందుకు నిరసనా? ఇదేం మానవత్వం ? నేను మాత్రం సాధారణ అనుభూతులనుంచి యే మాత్రం విడివడ గలిగాను? ఆ తల్లిమీద నా అంచనాల్నీ. ఆగ్రహాన్నీ, ఆందోళననూ వ్యక్తం చేసుకుంటున్నాను మించి, ఆ పసిబిడ్డ గురించి నేనూ ఆలోచించలేదు'.

అలాంటి భావం కలగగానే ఒక్క క్షణం ఉండలేక పోయాను. నా గదికి తాళంవేసి బయటకొచ్చాను.

నా కాళ్ళు ఆ ఇంటికేసి నడిచాయి. కిటికీకి చెందిన కింది తలుపులు మూసుకున్నాయి. ఓ దీపం వెలుగు మాత్రం ప్రసరిస్తూంది. నేనక్కడకు చేరగానే ఓ చిన్న మూలుగూ, "అమ్మా" అనే సన్నటి స్వరమూ వినిపించాయి.

"ఊరుకో నాన్నా, తప్పకుండా తగ్గుతుంది." అనునయిస్తోంది. ఆ తల్లి.

"నొప్పిగా ఉంది".

"ఏం చేద్దాం నాయనా, ఓర్చుకోవాలి" అంటూనే ఆమె ఎందుకో బయటకొచ్చింది. నన్ను చూసి గుర్తుపట్టింది.

"మీరా"? అంది ఆశ్చర్యంగా. "ఈ పాపిష్టి చేతులు విరిగిపోను. వీటితోనే నా బిడ్డను కొట్టాను. ఏం చేయమంటారు? రెండు రోజులుగా ఇంట్లో బియ్యంలేవు. ఎవరినో అడిగి పది రూపాయలు తెస్తే అవన్నీ మట్టి పాలయ్యాయి. ఇప్పుడు ఆ బాకీ ఎట్లా తీర్చటం? వాడి వైద్యానికీ ఎక్కడ అడుక్కు రావాలి?" ఆమె హృదయం నుంచి దూసుకొస్తున్న ఆవేదన,

శిలలా నిలబడ్డ నన్ను మేల్కొలిపింది. లోపల నుండి "అమ్మా" అనే పిలుపు !

ఇప్పుడు అత్యంత ఆత్మ విశ్వాసంతో ఓ విషయం చెప్పగలను మాతృత్వపు అనుభూతికీ, విశ్వజనీనతకూ శాశ్వతత్వం ఉండొచ్చుగాక !

అన్నిటికంటే భయంకరమైనది డబ్బు! అది సమగ్రం. డబ్బుకు ఎలాంటి శాశ్వతత్వం లేదు. సంపూర్ణంగా - అన్ని అనుభూతుల్నీ, అనుబంధాల్ని ధ్వంసం చేయగల శక్తి దానికే ఉంది.

అయినా....

అది శాశ్వతం కాదు....కాదు....కాదు....!